
# ఈవారం కథ

# పడుగుపేక

వెండి గొలుసులు పెనవేసి ప్రచండమైన తూర్పువాకిలి తలుపులు ఏదో అదృశ్య హస్తం తొలగిస్తోంది. పండు కుంకుమ ఆరబోసినట్లు గగన తలమంతా అరుణారుణ కాంతులు విస్తరిస్తున్నాయి. గాఢతమ నిద్రావస్థ నుండి ఇప్పుడిప్పుడే చైతన్యం సంతరించుకుంటున్న ప్రకృతి చిరుచిరు సవ్వడులతో సందడి చేస్తోంది. ఎత్తైన మహావృక్ష సముదాయం మధ్యవున్న గుడిసెల్లోంచి టక,టక చిత్రమైన ఏకలయతో మగ్గం మోత వినిపిస్తోంది. చిగురాకు పొత్తిళ్ళలో వెచ్చగా నిద్రిస్తున్న పక్షులు ఉదయరాగానికి మేల్కొని బద్ధకంగా రెక్కలు రెపరెపలాడిస్తూ కువకువ లాడుతున్నాయి. ఒక ప్రక్క ప్రకృతి క్రొత్త రోజుకు సన్నాహాలు చేసుకుంటూనే వుంది. నిశిరాత్రి నుండి మొదలైన టక టక ధ్వని రాత్రి వేళ 'నీలాంబరి' అయితే ప్రత్యూషంలో 'భూపాల' మవుతుంది. విశాలమైన వటవృక్షాల మధ్య ఒదిగిపోయిన వూరిళ్ళు చప్పున బయటకి కనపడవు. జనావాసపు చైతన్యం మగ్గపు మోతలోనే ప్రపంచానికి తెలుస్తుంది.



పానకాలు మగ్గం ముందు కూర్చుని నిర్విరామంగా పనిచేస్తున్నాడు. శరీరం వడిలిపోయినా పట్టుదల సడలని మనిషి. ఊపిరి పీలుస్తున్నంత సేపు. అలా నిర్విరామంగా అవిశ్రాంతంగా శ్రమిస్తూనే వుంటాడు. పనిలో దీక్ష తప్ప ఆశ కనపడదు. చేతిలో పని ముగించాలన్న తపన తప్ప ప్రతిఫలాపేక్ష కనబడదు-

రాత్రే పౌర్ణిమ సంబరం జరుపుకున్నారు. పేటలో అందరూ. ఆ రోజెవరూ పనిజోలికి పోరు. సంపాదించుకున్న దాంట్లో కొంతయినా ఆరోజు విందు, వినోదానికి ఖర్చు చేస్తారు. ఆడవాళ్ళు సిటీబస్‌లో టౌనుకెళ్ళి గాజులు, పూసలు కొనుక్కు తెచ్చుకుంటారు. మగవాళ్ళలో కొందరు తిని, త్రాగి ఖుషీ చేసుకుంటారు. పెద్దాయన పానకాలుకే సంబరం నచ్చదు. "అందుకేరా అబ్బీ సంపాదించినదంతా తాగుడుకి ఖర్చు పెట్టేసి దరిద్రం అనుభవిస్తున్నారు" అని కుర్రకారును మందలిస్తాడు.

ముసల్ది భ్రమరాంబ తెచ్చినది చాయ్ తాగి కాస్త బీడీ దమ్ములాగి మళ్ళీ పని ప్రారంభించాడు పానకాలు. చేతులు పనిలో లగ్నమయినా మనసు ఎటో ఆలోచిస్తోంది. 'సుధాకరం విషయం అబ్బాయితో మాట్లాడాలి వీడు చేతికె దిగొచ్చిందు. షావుకారు రెండు దఫాలు హెచ్చరించాడు' అనుకున్నాడు.

ఆ ఊళ్ళో చాలా పేటలున్నాయి. ఒక్కో పేటకు ఒక్కో ప్రాముఖ్యత వుంది. అది పేరుకు తగ్గట్టు వుంటుంది. దుకాణాలు అధికంగా వుండటం వల్లనో ఏమో ఒక ప్రాంతాన్ని కొట్ల బజారంటారు. వస్త్ర దుకాణాలు కుప్పలుగా రాశిపడిన ప్రాంత్రాన్ని క్లాత్ మార్కెంటంటారు. ఇట్లాగే జానపేట మరియంపేట, మసీదు సెంటరు అని రకరకాల సెంటర్ల కలపోత ఈ ఊరు. ఇందులో విశేషం ఏమీ లేదు. ఎందుకంటే ఇంచుమించు ప్రతి

-యర్రమిల్లి విజయలక్ష్మి

ఊరి స్వరూపం ఇట్లాగే వుంటుంది కనుక!

కానీ ఈ ఊళ్ళో ఇప్పుడు నేను చెప్ప బోయే పేట మాత్రం విశేషమైనదే! ఎన్నో సంవత్సరాలుగా నా మనసుని ఆలోచనని ప్రభావితం చేస్తున్న ఒక విషయం ప్రముఖంగా ప్రతిబింబించే ప్రాంత మది. అది ఒక్కటనే కాదు అట్లాంటి ప్రాంతాలెన్నో ఇంకా ఊరు నిండా అక్కడక్కడ చెదురు మదురుగా వున్నాయి.

గందర గోళంగా చిక్కుముడులుగా వున్నగొందుల్నీ దాటి మెయిన్‌రోడ్ ఎక్కితే వస్తుంది. నేషనల్ హైవేకి ప్రక్కగా విశాలమైన చల్లని చెట్లనీడలో పరుచుకున్న దేవాంగపురి. అక్కడంతా అడవిలా పెరిగిన చెట్లనీడలో విశాలమైన ఆరుబయళ్ళలో నేలను విరిగిన హరివిల్లులా రంగురంగుల మాలు పోగులు సాగర్చిన 'అల్లు' లుంటాయి. అక్కడ చిరుగాలిలో మగ్గం మోత చిత్రమైన లయతో తేలి తేలి వినవస్తుంది. ప్రణవ నాదంలా వుంటుందాధ్వని. అక్కడంతా ఆరు బయల్లో పటికుటీరాల్లా నిర్మించుకున్న వూరిళ్ళల్లో మగ్గాలు, రాట్నాలు, కుప్పలుగా రంగురంగుల మాలు పిడచలు.... దారపు కండెలు.. అదే వారి సంపద. తరతరాలుగా పెద్దలిచ్చి పోయిన స్థిరచరాస్తులు.

గుడిసెకు కుడివైపుగా నేలమాలిగలావున్న గుంటలో కూర్చుని మగ్గ మేస్తున్నాడు పావకాలు. పావకాల వయస్సు అరవై పై బడుతోంది. గుంటలో కూర్చుని సంవత్సరాలుగా నేసేనేసి అతనీ గూడు వంగిపోయింది. గుండెలు అర్చుకుపోయి మనిషి సన్నగా ఒరిగిపోయిన సర్విబొంగులా వుంటాడు. ఒక రాత్రీ-పగలని లేదు. నిరంతర పరిశ్రమ అతనిది. జీవితమున్నంత కాలం ఎప్పటికీ వదలని అవిశ్రాంత ఆకలి సమరం. జీవితాన్ని మించిపోయిన వృత్తి ధర్మం! పావకాలుకి నిజంగానే తన వృత్తి అంటే జీవితాన్ని మించిన గొప్పప్రేమ – ఆరాధన – అనురాగం తాతతండ్రుల దగ్గర ఉగ్గుపాలతో నేర్చుకున్న విద్య అందుకే నేతపని అంటే పావకాలు కంత మక్కువ? అంతకు మించిన గౌరవం! ఆస్తులు సంపాదించి ఇవ్వలేదని అయ్యని కాదనలేదు. కడుపు నిండా బువ్వయినా పెట్టలేదని అమ్మని నిందించలేదు. కష్టానికి తగిన ప్రతిఫలం అందటం లేదని మగ్గాన్ని వదులుకోలేదు. మనసులో సంఘర్షణమూ, గుండెల్లోని వేదనమూ అక్కడే తొక్కి వుంచి సంవత్సరాలుగా వృత్తినే నమ్ముకుని బ్రతుకు భారంగా లాగిస్తున్నాడు. ఒక్క పావకాలే కాదు ఆదరణ కరువైన – ఆదాయం గగనమైన ఈ మార్గాన్ని అనుసరిస్తున్న వేలాది నేత కార్మికుల తీరు అదే! విడిచిపోలేని మమకారం – పోయి మరో బ్రతుకు తెరువు సాధించుకోలేని నిస్సహాయత!

పావకాలు కొడుకులు కూడా అదే వృత్తిలో కొనసాగుతున్నారు. షావుకార్ల దగ్గర పనిచేసి పదిరూకలు సంపాదించుకుంటున్నారు. షావుకార్లు ఈ చిన్న పనివాళ్ళ శ్రమశక్తిని దోచుకుంటున్నారనీ పెట్టుబడిదారులనీ పోషిస్తు నాయకులు అంటారు. కాని పావకాలు అనుకుంటాడు పండించే వాడికి దక్కేది చారెడు గంజినీళ్ళే... నేసేవాడికి జానెడు గోచిపాతే. మోసే వాడు వేరు... పల్లకీ ఎక్కి ఊరేగే టోడు ఇంకోడు! అల్లనని ఏం లాభం చేసుకున్నోడికి చేసుకున్నంత.

ఈ రకమైన ఆలోచనలతో అతని లోని ఉద్రేకం, నిరుత్సాహం శాంతించి పోతాయి. కర్మ సిద్ధాంతాన్ని నమ్ముకొని మరో ఆలోచన మానుకుని నిర్లిప్తంగా మగ్గం గుంటలో కాలం గడిపేస్తున్నాడు. పావకాలు భార్య భ్రమరాంబ కూడా కండెలు తీసి పదోపరకో సంపాదిస్తుంది. ఇంటిల్లపాది రంగుమాలుతో పడుగు చేయడం – గంజిపెట్టి సాపు చేసి పాగళ్ళు వేయటం మొలకట్టటం లాంటి నేతపనిలో చిన్న పెద్ద అనక పాల్గొంటారు. వృద్ధుల ఉపాధికోసం ఈ మధ్య ప్రభుత్వం జనతా వస్త్రాల నేతపని ఏర్పాటు చేసింది. వస్త్రాలకు సరిపడ మాలు ఇచ్చి – ధోవతి కింతని కూలీ ఇస్తుంది.

ప్రస్తుతం పావకాలు ఈ పనే చేస్తున్నాడు. 'తనజీవితంలో రంగులు వెలిసి పోయాయి! వసంతాలు తరలి పోయాయి! శిశిరం గ:డుస్తోంది. ఇక రంగు రంగుల జరీపని తనేం చెయ్య గలడు. వారానికో రెండు పంచలు నేసిచ్చి కూలీ డబ్బులు తెచ్చుకుంటే చాలు.'

పావకాలు ఆడపిల్లలు కూడ చిన్న చిన్న పనులుచేసి అయ్యకు సాయన దేవారు. మాలు కండెలు పోయటం పడుగుచేయటం మగ్గం నేతలో సాయం చేయడం. తగిన సంబంధాలు చూసి ఆడపిల్లను పంపేడు. అక్కడా వాళ్ళు నేతపని వాళ్ళే పిల్లలు అక్కడా భర్తలకు యధాశక్తి సాయం చేస్తూనే వున్నారు. పనిచేసి తమ ధర్మాన్ని నిర్వర్తించుకోవటమే తప్ప తమ స్థితిగతులను ఆలోచించుకునే శక్తి వాళ్ళకి లేదు. ఇబ్బంది వచ్చి పడితే మరింతగా శ్రమించి ఇకో పదిరూపాయలు అదనంగా సంపాదించుకోవాలను కుంటారు.

**“నువ్వు, మీ నాన్నా, మీ తాతా ఆళ్ళ తాతలూ అంతా ఏం సంపాదించారు? షావుకార్లని మాస్టర్ వీవర్స్‌గా, శేఠ్‌లుగా తయారు చేశారు. మీరాళ్ళ కాడ కూలీలుగా పనిచేశారు. ఇప్పుడు ఆళ్ళ పిల్లగాళ్ళ కాడ మమ్మల్ని కూలి చెయ్యమంటున్నారు. ఎంత చేసినా, ఎంతమందిమి చేసినా మగ్గం మీది కెళ్ళందే మెతుకు లేదు కదా! కూడెట్టని ఈ కులవృత్తి ఎందుకయ్యా? నేపోను”**

అందువల్ల పావకాలు పెద్దరికానికా ఇంట్లో ఇంతవరకు ఏమీ ప్రశ్న ఎదురవలేదు. ఇంట్లోనే కాదు ఆపేట కంతటికీ పావకాలు పెద్ద. చిన్న, పెద్ద అందరూ అతని వయస్సుకి – నాయనో – అన్నఆనో బాబాయ్ ఆనో ఏదో ఒక బంధుత్వం కలిపి ఆప్యాయంగా పిలుస్తారు. పావకాలు జీవితంతోపాటు పెరుగుతూ వచ్చిన ఆత్మీయతా బంధం అది. ఎవరికి చిన్న సమస్య వచ్చినా ఆయన దగ్గర కొచ్చి పడతారు. ఇట్టే పరిష్కరించి పంపుతాడాయన. అట్లాంటి మనిషికీ పెద్ద సమస్య ఎదురైంది. పరిష్కరించుకోలేక కొట్టుమిట్టాడు తున్నాడు పెద్దాయన. వ్యక్తిగత సమస్య – కుటుంబసమస్య ఎవరికి చెప్పకుంటాడు? ఎవరు ఏమని తీర్పు చెప్తారు?

" పోనీ నాన్నా...! పసివాడు వాడ్నెందుకు బలవంత పెట్టటం ...? వాడికీ పనిమీద లేదు. చదువుకోవాలను కుంటున్నాడు. మనమంతా చేస్తున్నాం కదా...!" శివరావు ధైర్యంచేసి తండ్రితో అన్నాడు. ఈ మధ్య తండ్రి ఆరోగ్యం దెబ్బతింది. పైగా మనవడు సుధాకరాన్ని. 'జాకర్డు' పనిలో వుంచాలని పట్టుదల ఆయన తమ షావుకారు మల్లికార్జునరావుకి మాటిచ్చాడు. మొదట్నించి పావకాలు కుటుంబమంతా మల్లికార్జునరావు వంశీకుల దగ్గరే పని చేశారు. సుధాకరం చాలా తెలివైన కుర్రాడు. టెన్త్ ఫస్టున పాసయినాడు ఒకటి రెండుసార్లు తండ్రితో కలిసి జాకార్డు పని చేసాడు. ప్రత్యేకమైన ఆ జరీనేత పని ఎంతో నేర్పుతో కూడినది. ఎంతో కష్టమైంది. అంత కన్నా అందమైంది. అందుకనే జాకార్డు పనితనంతో నేసిన జరీ చీరలకు ఇప్పుడిప్పుడే మంచి గిరాకీ పెరుగుతోంది. చక్కని చిలకలు, హంసలు, నెమళ్ళు అందమైన లతలతో నిండిన జరీ పనిటంచులు. ఆ కొత్తరకం చీరలు ఆడవాళ్ళను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి.

బెనారస్ – కంచి – ఆరణి పట్టు చీరలను మరిపించే మురిపాల జాకర్డు జరీ చీరలకు మంచి మార్కెట్ వుంది. సుధాకరం పనితనం గుర్తించిన శేట్ అతణ్ణి పనిలోకి పంపమనగానే పావకాలు మహానందంతో అంగీకరించాడు. కాని సుధాకరం 'పోనని' ఎదురు తిరిగే సరికి దిమ్మెర పోయాడు పావకాలు. అది ఆయన ఎప్పుడూ ఊహించని సమాధానం. అదీ నిండా పదహారేళ్ళైనా లేని ప్రియమైన మనవడి దగ్గర్నించి! . ఉండేలు దెబ్బతిన్న పక్షిలా ముసలాయన అహం విలవిలలాడింది. అవతల తమ షావుకారికి మాట ఇచ్చాడు. ఇప్పుడెళ్ళి 'నాయనా వాడు చదువుకుంటాడట. వాడికి నేతపని ఇష్టం లేదు.' అని చెప్పగలడా తను! అట్లాచేస్తే

ఆ పెద్దమనిషేమను కుంటాడు. పావకాలు మనవడ్ని బుజ్జగించి – దగ్గర కూర్చోపెట్టుకుని ఎంతో చెప్పాడు. తరతరాలుగా వస్తున్న కులవృత్తి చల్లని తల్లి లాంటిదన్నాడు. తమవంశంలో తాత ముత్తాతలంతా ఇదే వృత్తిలో చక్కగా కొనసాగారన్నాడు. తనకాపని ఇష్టం లేదని బాగా చదువుకుని మంచి ఉద్యోగంలో చేరతానని మనవడు మొరాయిస్తే మందలించాడు."చదువంటే మాటలా వేలతో కూడినపని మనవల్లేమవుతుంది? ఎలాగో చదివినా ఉద్యోగం మాత్రం దొరకొద్దూ" ఉగ్గుపాలతో అబ్బిన విద్యని అలక్ష్యం చెయ్యవద్దన్నాడు. ఎంత చెప్పినా సుధాకరానికి ఎక్కలేదు. "కూడు – గుడ్డ ఇవ్వలేని కులవృత్తి నాకొద్దు. చదువుకుంటే పెద్ద ఉద్యోగం దొరక్కపోయినా గుక్కెడు గంజైన ఎలాగో సంపాదించుకోవచ్చు" అన్నాడు. తాత మళ్ళీ విడవకుండా చెప్తుంటే పసి తనపు అమాయకత్వంతో ఆవేశంతో అన్నాడు "నువ్వూ మీ నాన్న మీతాత, ఆళ్ళోళ్ళు తాతలు అంతా ఏం సంపాదించారు. షావుకార్లని మాష్టర్ వేవర్సుగా – శేఠ్లుగా తయారుచేసారు. మీరాళ్ళకాడ కూలీ చేసారు. ఆళ్ళ పిల్లగాళ్ళకాడ మమ్మల్ని కూలీ చేయమంటున్నారు. ఎంత చేసినా ఎంత మందిమి చేసినా మగ్గం మీది కెళ్ళందే మెతుకులేదు కదా... ఇయ్యాల – రేపు రెక్కిరుచుకొని గూళ్ళిరగొట్టుకున్నా గంజి లేదు. కొడెట్టలేని కులవృత్తి ఎందుకయ్యా... నేపోను!"అని తెగేసి చెప్పేసి ముఖం తిప్పేసుకుని వెళ్ళాడు.


సుధాకరే కాదు.... ఎన్నో ఏళ్ళుగా గుండెల్లో దాచుకున్న అసంతృప్తిని ఇంట్లో మిగతా సభ్యులు కూడా తలొక రకంగా వ్యక్తపరిచారు. మొత్తానికి అందరూ సుధాకరు అభిప్రాయాన్ని సమర్థించారు. పావకాలు ఏమీ చెయ్యలేని నిస్సహాయస్థితిలో పడిపోయాడు. కలత చెందిన మనస్సుతో వెళ్ళి మల్లికార్జునరావుకి విషయం చెప్పాడు. అతమా ఏమీ అనలేదు. పైగా "అవును బాబాయ్! మనమంటే మరో మార్గం లేక తాపత్రయ పడుతున్నాం. రోజులు మారాయి పిల్లగాళ్ళు బాగా చదువుకొని ఎక్కొత్తున్నారు. మీ సుధాకరం తెలివైనోడు చదువుకోనీ..." అని సమాధాన పరచి పంపాడు.

పావకాలు నిశ్శబ్దంగా తల పంకించి బరువుగా కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి వచ్చాడు. తమ ప్రాణంగా ఎంచిన వృత్తిగా తన కళ్ళెదుటే కాలం చెల్లిపోతుంటే ఆయన గుండె విలవిలలాడింది. 'నిజమే ఈ పేటలోని సుధాకరం ఈడు పిల్లగాళ్ళందరూ కాలేజికి పోతుంటారు మగ్గం జోలికే ఎవరూ రావడం లేదు. కాలం మారిపోయింది. బ్రతుకు తెరువుకు కుర్రతరం కొత్త దారులు వెతుక్కుంటోంది. సురక్షితమైన ఉపాధికోసం కుటుంబానికింత కూడు గూడు ఇచ్చేపని కోసం చింతలేని బ్రతుకుకోసం వలిగిన బాట విడచి కొత్తబాట ఏర్పరచుకుంటోంది.' ప్రభుత్వం నేత కార్మికుల కోసం పథకాలేస్తోంది. కమిటీలను పంపి తమస్థితి గతుల నివేదికలను పరిశీలించి సాయం అందిస్తానంటోంది. బ్యాంకుల ద్వారా అప్పులిప్పిస్తోంది.ఉచితంగా మగ్గాలు – నూలు ఇచ్చి నేతపనికి కూలి ఇస్తోంది. ఇన్నిచేసినా తమబోటోళ్ళు ఇట్టాగే బతుకు ఈడుతున్నారంటే..' ఇది.. ఇది ... ఆదరణలేని.... 'పావకాలు మరి ఆలోచించలేనట్లు తల విదిలించుకున్నాడు.

ముఖాన పట్టిన చెమటలు పైపంచతో తుడుచుకుని మగ్గం గుంటలో కూలబడ్డాడు. అలవాటు ప్రకారం రెక్కాడుతూ పోతోంది.

"కూడుతిని కొంత తొంగోరాదూ.... పొద్దుట్నించీ ఆపాట మాట, పలుకు లేకుండా కూచున్నావు...." భ్రమరాంబ ఎన్నోసార్లు వచ్చి చెప్పింది. చిటికెటు పండు మిరపకారం – పట్టెడు ముతుక మెతుకులు ఒక్కోరోజు కొసన్ని మజ్జిగచారు విరక్తిగా నవ్వుకున్నాడు. పావకాలు తన సర్వస్వమైన మగ్గం గుంటలో హస్తాన్ని మగ్గం కమ్మీమీద ఆన్చి కాస్తంత చోటులో పడుకున్నాడు. తెల్లారి సుధాకరానికి చెప్పాలి... బాగా చదువుకోమని... జీవితాలు చెల్లిపోయిన అరకొర బతుకులు ఆర్థాకలి. డొక్కలు తప్ప ఏ ముందట...'

కాసీ పావకాలు మనసులో మాట అతనిలోనే వుండిపోయింది. తూర్పు తెల్లారక ముందు నుంచి టకటక ఏకలయతో జీవన సంగీతంలా వినవచ్చే మగ్గం మోత వినబడటం లేదు. చిత్రమైన నిశ్శబ్దం – అలవాటులేని నిశ్శబ్దం – గుడిసె నంతా ఆవరించుకుంది. "రేతిరంతా పనిచేసిండు నిదరపోతున్నాడేమో" అనుకున్న భ్రమరాంబ మగ్గం గుంటలో పడివున్న పావకాలుని చూసి ఉలికిపాటుతో పెనుకేక పెట్టింది. తెల్లారేసరికి ఊరువాడ పావకాలు గుడిసె ముందు పోగయింది. గుడిసెంతా కన్నీరు వాగయింది. భ్రమరాంబ ఎండిన గుండెలు బాదుకుంటూ రోదిస్తోంది. పిల్లలంతా శోక సముద్రంలో మునిగిపోయారు. పేట పేటంతా వచ్చి ఓదారుస్తోంది. పావకాలు మంచితనాన్ని తలుచుకుంటున్నారు.




ఎండి వడలిపోయిన బక్కశరీరం – వంగిపోయిన వెన్ను – ఎముకల పోడువుగా అరిగిపోయిన రెక్క గూళ్ళు వెన్నుకంటుకు పోయిన డొక్క – చచ్చినా / బతికినా మగ్గమే శరణన్నట్లు మగ్గం కమ్మీమీద ప్రేమగా ఆన్చివున్న శల్యావశిష్టమైన చెయ్యి – భుజం మీద చిరిగిన పై పంచ. తాతగారి శరీరాన్ని చూసి గుండె కదిలి బావురుమన్నాడు సుధాకరం.

షావుకారు వచ్చి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చాడు. స్నానం చేయించి నన్నని కొత్త నేత పంచ చుట్టబెట్టారు. పావకాలుకి. 'తనకి తెలిసి తాత కొత్తపంచె కట్టుకోవడం ఇదే' దీనంగా అనుకున్నాడు సుధాకరం.

మూడు ప్రక్కల తెల్లని బట్ట కట్టిన మందిరంలో అంతెత్తున కూర్చుని – పూలు, బుక్కా చల్లించుకుంటూ మేళ తాళాలతో తరలిపోయాడు. పావకాలు.

బావురుమంటున్న ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం తాండవిస్తోంది. అగాధమైన శూన్యాన్ని వదలి పెద్దాయన వెళ్లిపోయాడు. సుధాకరం దిగులు అంతా ఇంతా కాదు. 'తాత వేదించాడు.ఇలా వెళ్లిపోతాడను కోలేదు అన్యాయం చేసి. ఆయన మాటాడిన షావుకారు దగ్గర పనిలో చేరినా బాగుండు' నిశ్శబ్దమైపోయిన మగ్గం గదిలోకి వచ్చి దిగులుగా తాతకూర్చునే దగ్గర కూలబడ్డాడు. అతిపురాతనమైన మగ్గం దండి మీద ఆప్యాయంగా నిమిరాడు. తాతని తాకినట్లే మనసుని కదిపిందా స్పర్శ. "తాతో నిన్ను నొప్పించినా, నన్ను..... క్షమించు తాతా... " అంటూ బావురుమన్నాడు సుధాకరం.